క్లుప్తంగా

విద్యుత్ సమస్యపై అరకు ఎంపీ మాధవికి వినతి



అరకు ఎంపీ మాధవికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కొయ్యూరు: అంతాడ పంచాయతీలో బోయవుట కొత్తవీధికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు అరకు ఎంపీ గొడ్డేటి మాధవిని కోరారు. శరభన్నపాలెంలో ఎంపీ మాధవిని గ్రామస్తులు ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. రాత్రయితే భయంతో పడుకుంటున్నట్టు తెలిపారు. పాములు, తేళ్లు లాంటివి వస్తాయని ఆందోళన చెందుతున్నామన్నారు. దీనిపై స్పందించిన ఎంపీ మాధవి త్వరితగతిన గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పోలీసు అమరవీరులకు నివాళి



ఇందుకూరుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

దేవీపట్నం: స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి అమరులైన పోలీసులకు నివాళులర్పించారు.

ఆర్ఎంపీలు ప్రాథమిక వైద్య సేవలు అందించాలి



గ్రామీణ వైద్యుల డివిజన్ కమిటీ కార్యవర్గ సభ్యులు

ఎటపాక: గ్రామీణ వైద్యులు ప్రాథమిక వైద్యసేవలు మాత్రమే అందించాలని తీర్మానం చేశారు. ఆదివారం తోటపల్లిలో గ్రామీణ వైద్యుల డివిజన్ సమావేశం ఏర్పాటు చేశారు. తమ పరిధి దాటకుండా రోగులకు ప్రథమ చికిత్స అందించి దగ్గరలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించాలని నిర్ణయించారు. అనంతరం డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా అనిఫ్, కమిటీ డివిజన్ సభ్యులుగా చైతన్య, శ్రీనివాస్, రమేష్, గణేష్, సాగర్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

150 మందికి వైద్య పరీక్షలు



రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

రంపచోడవరం: రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమండ్రి వారి అధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించినట్లు మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహరాజ్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ దాసరి ఉమా మహేష్, తలారి వెంకట సుబ్బారావు, ఎస్.సంపత్‌కుమార్ పాల్గొని, సుమారు 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. క్యాంప్ కో - ఆర్డినేటర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. రోగులకు, సహాయకులకు అన్నదానం నిర్వహించారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

నర్సీపట్నం: క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని టౌన్ సీఐ ఎస్.గణేష్ పేర్కొన్నారు. వాకర్స్ క్లబ్ సహకారంతో నర్సీపట్నం యూత్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించేవారికి ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఈ పోటీల్లో 13 జట్లు పాల్గొన్నాయి. వ్యాపారి వెలగానారాయణరావు, నిర్వాహకులు కోటిబాబు, చంటి, చరణ్, పీడీలు కె.రమేష్, పి.వి.రమణ పాల్గొన్నారు.

విజయదుర్గమ్మ నమోస్తుతే



పాడేరు మోదకొండమ్మతల్లి ఆలయం ప్రాంగణంలో విద్యుత్‌లైట్లు



పాడేరులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, డాక్టర్ నర్సింగరావు దంపతులు

- దసరాకు ముస్తాబైన మన్యం
- వైభవంగా శరన్నవరాత్రుల ఉత్సవాలు
- ప్రత్యేకాలంకరణలో దుర్గాదేవి
- విద్యుత్‌దీపాలంకరణలో ఆలయాలు



దూసరపాము ఆలయంలో ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

సాక్షి,పాడేరు: దసరా పండగకు మన్యం ముస్తాబైంది...కనకదుర్గమ్మతల్లి ఉత్సవాలతో జిల్లా వ్యాప్తంగా సందడి నెలకొంది. శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ప్రతి గ్రామంలో దుర్గమ్మ ఆలయాలు సర్వాంగ సుందరంగా దర్శనమిస్తున్నాయి. విద్యుత్ దీపాలతో అలంకరించారు. చలువ పందిర్లు వేశారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ అన్నదానాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. దుర్గాదేవిని ప్రత్యేకంగా అలంకరించారు.



పాడేరు ఆస్పత్రి సెంటర్‌లో అమ్మవారి ఉత్సవ విగ్రహం

మార్కెట్‌కు దసరా శోభ సంతరించుకుంది. దుకాణాలన్నీ రద్దీగా కనిపించాయి. అల్లూరి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులోని కనకదుర్గమ్మతల్లి ఆలయంతో పాటు, మోదకొండమ్మతల్లి ఆలయం, ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయాల్లో దుర్గమ్మతల్లి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రోడ్లన్నీ విద్యుత్ అలంకరణతో ముస్తాబు చేశారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావులు కాంప్లెక్స్ రోడ్డులోని దుర్గమ్మతల్లి ఉత్సవ విగ్రహానికి పూజలు జరిపారు.

చింతపల్లి: దసరా ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ విగ్రహాన్ని ఆదివారం భక్తులు గాజులతో అలంకరించారు. ప్రతి రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మండల కేంద్ర వాసులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు.

రంపచోడవరం: రంపచోడవరం స్టేట్ బ్యాంక్ ఎదురుగా అల్లూరి సీతారామరాజు మోటార్ ఓనర్స్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నూతన నిర్మాణం (పునఃనిర్మిస్తున్న) నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఏకదశ దుర్గా హోమం పండితులు లింగాల సీతారామాంజనేయప్రసన్నకుమార్ ,పండితులు సూర్యవిశ్వేశ్వర పవన్ కుమార్ శర్మ నిర్వహించారు.

గంగవరం : మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు ఆదివారం అమ్మవారిని దుర్గాదేవి అవతారంలో రాజరాజేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృత అభిషేకాలు చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారు ఎంతో భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో వందలాదిమంది భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకోగా , ఆలయ కమిటీ మహిళలు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: దూసరపాము ఆలయంలో అమ్మవారు ఆదివారం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజాము నుంచే భక్తులు అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. మండలంలోని జడ్డంగి, చెరకుంపాలెం, లాగరాయి, కొమరాపురం, మద్దిబందల, చికిలింత దుర్గాదేవి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. స్థానిక కన్నయమ్మపేట అమ్మవారిని భక్తులు ట్రాక్టర్‌పై ఊరేగిస్తు సందడి చేశారు.



రంపచోడవరంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు



గంగవరంలో పూజలు చేస్తున్న భక్తులు



చింతపల్లిలో గాజులతో అమ్మవారిని అలంకరిస్తున్న భక్తులు

శ్రమదానంతో గోతుల పూడ్చివేత



గోతులను పూడ్చుతున్న సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్, సర్పంచ్ రాంబాబు

జి.మాడుగుల: స్థానిక తహసీల్దార్ కార్యాలయ జంక్షన్-పాడేరు రోడ్డు మార్గంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, సీఐ, ఎస్ఐ ఆదివారం శ్రమదానంతో గోతులు పూడ్చారు. గతంలోను, ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డులో పెద్దపెద్ద గోతులు ఏర్పడి ప్రమాదకరంగా తయారయ్యాయి. దీంతో సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్, సర్పంచ్ కిముడు రాంబాబు, బందవీధికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేష్, పోలీస్ సిబ్బంది పాడేరు రోడ్డు మార్గంలో క్వారీ చిప్స్, డస్ట్ వేసి శ్రమదానంతో గోతులను పూడ్చివేశారు. రోడ్డు మార్గంలో శ్రమదానంతో గుంతలు పూడ్చి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టిన సీఐ, ఎస్ఐ, సర్పంచ్‌లకు వాహనదారులు, ప్రయాణికులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

బోరు పనులు ప్రారంభం



సిరిపురంలో బోరు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ గోపాల్ తదితరులు

చింతపల్లి: మండలంలోని పెదబరడ పంచాయతీ సిరిపురంలో బోరు ఏర్పాటు పనులను సర్పంచ్ సమిడి గోపాల్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ గొడ్డేటి మాధవి మంజూరు చేసిన నిధులతో బోరు పనులు చేపడుతున్నామన్నారు. పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో ఇప్పటికే బోర్ల నిర్మాణం జరిగిందన్నారు. గొడుగుమామిడి, రోలుగుంట గ్రామాల్లో బోరు పనులు చేపడుతున్నట్టు తెలిపారు. దీంతో గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. మాజీ సర్పంచ్ బోయిన సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు లోవరాజు, మోహన్‌రావు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

కొయ్యూరు: చిట్టింపాడు పంచాయతీ గోపవరంకు చెందిన సెగ్గే రమణబాబు కొద్ది రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బాధిత పేద కుటుంబాన్ని ఆదుకునేందుకు వారియర్స్ ట్రస్టు ముందుకొచ్చింది. ఈ మేరకు సంస్థ అధ్యక్షుడు టి.మల్లేశ్ ద్వారా చింతపల్లి యూనిట్ చైర్మన్ దూనబోయిన రమణ గోపవరం గ్రామానికి వచ్చి మృతుడు రమణబాబు కుటుంబానికి నిత్యావసర సరకులు, దుస్తులను అందజేశారు. బాధిత కుటుంబానికి సాయం చేసేందుకు వచ్చిన రమణను హెల్పింగ్‌హ్యాండ్స్ అధ్యక్షుడు అభినందించారు.వారియర్స్ టీం సభ్యులు రజేష్, శేఖర్, మోదగిరి, బాలాస్కర్, రమేష్, నానాజీ, లోవరాజు, గ్రామ పెద్దలు గాంధీ బొజ్జన్నదొర, రాజారావు, చిన్న, పోతురాజు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి నిత్యావసర సరకులు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కన్నూరుపాలెం హైస్కూలులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 1994-95 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఒకరికొకరు పలకరించుకొని పాత జ్ఞాపకాలు నెమరు వేసుకొని ఆనందంగా ఆట పాటలతో గడిపారు. సామూహికంగా భోజనాలు చేశారు. పూర్వ విద్యార్థులు కె.చంద్రరావు, పి.ముత్యాలరావు, కె.వాసు, డి.రమణ,డి.శ్రీను, పి. అమ్మాజీ, కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రికి మాలధారుల పయనం



రాజవొమ్మంగి నుంచి విజయవాడకు పయనమైన భవానీ మాలధారులు

రాజవొమ్మంగి: స్థానికంగా భవానీ మాలధారులు, భక్తులు ఆదివారం ఇరుముడులు ధరించి ఇంద్రకీలాద్రికి పయనమయ్యారు. అంతకు ముందు వీరంతా గురుభవానీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రాజవొమ్మంగి మండలంలోని జడ్డంగి, ఒట్టిగెడ్డ, అమీనాబాద్ కాలనీ, లబ్బర్తి, లాగరాయి, దూసరపాముకు చెందిన సుమారు 200 మంది భవానీ మాలధారును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా మాలధారులు విజయవాడ కనకదుర్గమ్మ గుడికి కుటుంబసభ్యులతో సహా బస్సులు, మినీ వాహనాలపై బయలుదేరి వెళ్లారు.

ఏకాగ్రతతో చదివితే ఉజ్వల భవిష్యత్తు

మునగపాక: పోటీ పరీక్షల్లో రాణించాలంటే ఏకాగ్రత ఎంతో అవసరమని విశ్రాంత డీఈవో శిష్టా తమ్మిరాజు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్ఎంఎంఎస్ శిక్షణ తరగతుల ముగింపులో భాగంగా నిర్వహించిన పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా తమ్మిరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కె.వి.రమణ, ఆడారి దక్షిణామూర్తి, ఎం.వై.రాము, శివకోటి దుర్గా ప్రసాద్, మాడెం జోగారావు, శ్లా జగదీష్ , సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నమూనా పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు

కశింకోట: జాతీయ ప్రతిభ ఉపకార వేతనం(ఎన్ఎంఎంఎస్) పరీక్షలో విజయం సాధించాలని స్పందించే హృదయం సంస్థ ఉపాధ్యక్షుడు ఆచంట నాగేశ్వరరావు కోరారు. స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో స్పందించే హృదయం సంస్థ ఆధ్వర్యంలో పది రోజులపాటు 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పరీక్షకు నిర్వహించిన ఉచిత శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా వారికి నమూనా పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సంస్థ ప్రతినిధులు ఎస్. రమేష్, ఎ.వి.ఎస్ మూర్తి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏళ్లనాటి కల..సాకారమైన వేళ



ప్రారంభమైన రోడ్డు పనులు

- మాలింగవలస రోడ్డుకు మోక్షం
- రూ.39 లక్షలతో తారురోడ్డు పనులు ప్రారంభం
- గ్రామస్తుల హర్షం

అనంతగిరి: ఏళ్లనాటి మాలింగవలస గ్రామస్తుల రహదారి కల ఎట్టకేలకు సాకారమైంది. కనీస రహదారి లేక ఆ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రవాణా సౌకర్యం లేక కాలినడకన వెళ్లాల్సి వచ్చేది.. గత టీడీపీ హయాంలో గ్రామస్తులు పలు మార్లు పాలకులకు వినతులిచ్చినా పట్టించుకోలేదు..వర్షాలు కురిస్తే గ్రామానికి వెళ్లేందుకు దారి కూడా కొట్టుకుపోవడంతో తీవ్ర అవస్థలు పడేవారు..అదంతా గతం.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అరకు నియోజకవర్గంలోని శివారు గ్రామాల్లో సైతం రహదారులు, డ్రైనేజీలు తదితర పనులకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ప్రత్యేక చొరవతో పెద్దూరు నుంచి మాలింగవలస గ్రామం మీదుగా పాతకోట ప్రాంతాన్ని కలుపుతూ పెదబయలు రోడ్డు వరకు మెటల్ రోడ్డు నిర్మించారు. ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.39 లక్షలతో పెద్దూరు గ్రామం నుంచి మాలింగవలస వరకు తారురోడ్డు నిర్మాణానికి ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ గంగరాజు శంకుస్థాపన చేశారు. తారురోడ్డు నిర్మాణ పనులను పంచాయతీరాజ్‌శాఖ పర్యవేక్షణలో సాగుతుంది. ఎట్టకేలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామానికి రహదారి సౌకర్యం కలగడంపై గ్రామస్తులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. దశాబ్దాల రహదారి కల నెరవేరడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, సర్పంచ్ రూతు

త్వరితగతిన పూర్తి చేస్తాం

నాణ్యత ప్రమాణాలతో రోడ్డు నిర్మాణ చేపట్టే విధంగా కృషి చేస్తున్నాం. పనులు ప్రారంభం కావడంతో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. గడువులోగా త్వరిగతిన పనులు పూర్తిచేసి, రహదారిని అందుబాటులోకి తీసుకొస్తాం.

– సాయి విజయ్, ఏఈ, పంచాయతీరాజ్

వ్యసనాలకు దూరంగా ఉండాలి

గూడెంకొత్తవీధి: మండలంలోని ధారకొండ పంచాయతీలో చీలకవీధి, అమ్మవారి దారకొండ, జాజిపాకలు, దుర్గం, గడ్డిబంధ, నల్లమూక, సెబ్బంపల్లి, తడకపల్లి గ్రామాల్లో ఎస్ఐ అప్పలసూరి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో ఆపరేష్ పరివర్తన కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఉన్నత విద్యపై దృష్టి సారించాలని సూచించారు. సారా తయారీ, విక్రయాలు, గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని, వాటికి దూరంగా ఉండాలన్నారు. గిరిజనులు వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలని, పిల్లలను పాఠశాలలకు పంపాలని సూచించారు. మావోయిస్టుల కారణంగా ఇప్పటివరకు ఆయా ప్రాంతాల్లో అభివృద్ధికి ఆటంకం కలిగిందని, ప్రస్తుతం అన్ని గ్రామాల్లో రహదారులు, తాగునీరు, సెల్ టవర్ల ఏర్పాటు తదితర పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో యువకులకు వాలీబాల్ కిట్లు, పిల్లలకు చాక్లెట్లు అందజేశారు.



యువకులకు వాలీబాల్ కిట్లను అందజేస్తున్న ఎస్ఐ అప్పలసూరి

ఆదివాసీల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

అరకులోయ రూరల్: ఆదివాసీల హక్కుల పరిరక్షణ అందరిపై బాధ్యత ఉందని గిరి జాగృతి జిల్లా అధ్యక్షుడు మోరి సింహాచలం తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం గిరి జాగృతి సంఘం జిల్లా అధ్యక్షుడు మోరి సింహాచలం, బహుజన ఉపాధ్యాయుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కొరతం ఈశ్వరరావులు మాట్లాడుతూ ఏజెన్సీలోని ఆదివాసీల హక్కులు, చట్టాల పరిరక్షణకు అందరూ కృషి చేయలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో మన్యంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు. గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులు గిరిజనులుగా చలామణి అవుతూ ఆదివాసీ హక్కులను కాలరాస్తున్నారన్నారు. ఉన్నత చదువుకు గిరిజన విద్యార్థులకు సాయమందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో గిరిజనులకు మరిన్ని సేవలందించేందుకు ఆదివాసీ ప్రజాప్రతినిధులు, ఉన్నత విద్యావంతులు, ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు ఏకతాటిపై రావల్సిన అవసరం ఉందని వారు కోరారు.



మాట్లాడుతున్న సింహాచలం, ఈశ్వరరావు

ఆదివాసీ జేఏసీ సభ్యుల నిరసన

రంపచోడవరం: ఆదివాసీ తెగల పేరుతో నకిలీ ధ్రువపత్రాలు పొంది కొందరు విద్య, ఉపాధి, ఉద్యోగ, రాజకీయ వ్యాపార రంగాలను అనుభవిస్తూ నిజమైన ఆదివాసీలకు అన్యాయం చేస్తున్నారన్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు కంగల శ్రీనివాస్ చెప్పారు. రంపచోడవరం ఐటీడీఏ ఎదుట ఆదివారం రెండో రోజు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ ధ్రవపత్రాలు జారీ చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకొని వారిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నేతలు రామన్న దొర, శుభ కృష్ణదొర, సూర్య చంద్రం దొర, బొజ్జి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రంపచోడవరం ఐటీడీఏ ఎదుట నిరసన దీక్ష చేస్తున్న ఆదివాసీ జేఏసీ సభ్యులు

28న దేవస్థానంలో ఖాళీ స్థలం లీజుకు వేలంపాట

అనకాపల్లిటౌన్: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ లో శ్రీ సత్యనారాయణ, సూర్యనారాయణస్వామి దేవస్థానం ఆవరణలో ఖాళీ స్థలంపై ఏడాది పాటు హక్కు కల్పించేందుకు ఈనెల 28న వేలంపాట నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె.ఆదినారాయణ, చైర్మన్ కె.ఎం.నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపా రు. వేలంలో హక్కు దక్కించుకునేవారు ఖాళీ స్థలాన్ని అద్దె ప్రాతిపదికన వివాహాది శుభకార్యక్రమాలకు ఇవ్వవచ్చని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకూ(ఏడాదిపాటు) హక్కు పొందేందుకు దేవస్థానం ఆవరణలో టెండర్‌కమ్ బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంపాటలో పాల్గొదలచిన వారు రూ.50వేలు ధరావత్తుగా చెల్లించాలని తెలిపారు. పాటదారులు రూ.2లక్షల విలువగల సాల్వెన్స్ సర్టిఫికెట్లు ఇవ్వవలసి ఉంటుందన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

కశింకోట: మండలంలోని విసన్నపేట వద్ద ఉన్న పడమటమ్మ లోవ ప్రాంతంలోని తోటల్లో పేకాట ఆడుతున్న ఐదుగుర్ని ఆదివారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. కూర్మన్నపాలెం ప్రాంతానికి చెందిన వీరి వద్ద నుంచి రూ.1050 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.